

ఆక్రమణల తొలగింపు పరిశీలన

ప్రజాశక్తి - ఉండి

ఉండి మెయిన్ సెంటర్లో ఉన్న ఆక్రమణల తొలగింపును స్థానిక ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణలు చేసుకుంటూ పోతే అభివృద్ధి ఎలాగని ప్రశ్నించారు. రహదారుల విస్తరణ లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దానితోపాటు రోడ్లు, పంట కాలువల వెంబడి ఉన్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ తమకు సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట డిసి ఛైర్మన్ తోట ఫణిబాబు, డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయిబచ్చిరాజు, నాయకులు కొత్తపల్లి నాగరాజు, కమిరెడ్డి శ్రీనివాస్, డ్రైనేజీ ఎఇ సోమిశెట్టి జయప్రకాష్, సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు..

ఇదేమి వాతావ'రణం'..!

ఇదేమి కాలం.. అనే రీతిలో వాతావరణంలో అనూహ్య రీతిలో చోటుచేసుకుంటున్న మార్పులు జిల్లాలోని అన్ని తరగతుల ప్రజలనూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వేసవిలో ఎండలు దారెత్తించగా వర్షాకాలంలోనూ ఎక్కువ రోజులు అదే పరిస్థితి కొనసాగుతుండడం అందరినీ హడలెత్తిస్తోంది. వేసవిని తలదన్నేలా ఎండ వేడిమితోపాటు ఉక్కబోత అల్లాడిస్తోంది.



వాతావరణంలో అనూహ్య మార్పులతో జనం విలవిల


సాగునీరు, ముంపు సమస్యతో తల్లడిల్లుతున్న రైతులు

ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి - డెస్క్

ఈసారి రుతుపవనాల ముందస్తు రాకతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని సాగిన ప్రచారంతో రైతులంతా సాగుకు సన్నద్ధమయ్యారు. కాల్వలకు జూన్ ఒకటో తేదీనే నీటిని విడుదల చేసినా దిగువ స్థాయిలో కొన్నిచోట్ల కాల్వల పనులు జరుగుతుండటంతో శివారు ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో సీజన్ ప్రారంభంలో చిరుజల్లులు ముసిరింపగా చినుకు జాడ లేకుండాపోవడంతో రైతులు ఖరీఫ్ సాగుకు కనీసం దమ్ములు చేయించలేని దుస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే ఒక్కసారిగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో రైతులు ఊపిరిపీల్చుకుని సాగు పనులు ముమ్మరం చేశారు. ఒకవిధంగా చెప్పాలంటే రుతుపవనాల ముందస్తు రాకతో ముందను సాగు సాధ్యమే అనుకున్నా ఎప్పటిలానే వర్షాభావ పరిస్థితులు, సాగునీరందక సాగు పనులు ఆలస్యమయ్యాయి. ఎట్టకేలకు నారుమడులు పూర్తి చేసి నాట్లు దశకు చేరుకుని వేస్తున్న తరుణంలో కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షాలు నాట్లు వేసిన చేలను ముంచెత్తాయి. దీంతో ముంపు బారిన వరిచేల రైతులు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి వైపరీత్యం అనేకన్నా పాలకుల వైఫల్యం ఈ సమస్యకు మూలకారణమని చెప్పక తప్పదు. కాల్వల ఆధునికీకరణ పనులను పూర్తిగా అటకెక్కించిన పాలకులు, కనీసం మురుగు డ్రెయిన్లలో చెత్త, గుర్రపుడెక్క వంటివి తొలగించే ప్రయత్నం చేయకుండా వర్షాల సీజన్‌లో హడావుడి చేయడంతో ముంపు సమస్య తప్పడం లేదని స్పష్టమవుతోంది. గుర్రపుడెక్క తొలగించకుండా కేవలం మందు పిచికారీ చేసి వదిలేయడంతో అది కుళ్లి దిగువకు వెళ్లేసరికి కనీసం రెండు, మూడు రోజులపైనే పడుతోంది. అదీ ఎక్కడోచోట అడ్డుపడటంతో మురుగునీరు సాఫీగా ప్రవహించే పరిస్థితి లేక పొలాలు రెండు నుంచి మూడు రోజులపాటు నీటిలో నానుతున్నాయి. దాని నుంచి బయటపడ్డాక మళ్లీ ఎండలు దారెత్తిస్తుండడంతో శివారు పొలాలకు సాగునీరందక, ఎండ తీవ్రతకు నాట్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. అతివృష్టి, అనావృష్టి ఈ సీజన్‌లో రైతులను ఉక్కిబిక్కిరి చేస్తున్నాయి. ఇదే పరిస్థితి ఆక్వా రంగంలోనూ కన్పిస్తోంది. వర్షాలు కురుస్తున్న సమయంలో ఆక్సిజన్ అందక, ఎండల తీవ్రత వల్ల మరో సమస్యతో ఆక్వా రైతులు తల్లడిల్లుతున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని వరి, ఆక్వా రైతులు వాపోతున్నారు.

ఇక ఎండా కాలాన్ని తలపిస్తున్న ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు, చిరువ్యాపారులు విలవిల్లాడుతున్నారు. వర్షాకాలంలోనూ ఎసిలు ఉపయోగించక తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. వాతావరణంలో అనూహ్య మార్పులతో జనం జ్వరాలు, జలుబు, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు. తీవ్ర వేడి వల్ల విరోచనాలు వంటి సమస్యలు సైతం ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని క్లినిక్‌లు కిటకిటలాడుతున్నాయి. వాతావరణంలో అనూహ్య మార్పులతో ఇదేమి కాలం అనుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని జనం లబోదిబోమంటున్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలి

కొనసాగిన ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రచార యాత్ర

ప్రజాశక్తి - భీమవరం

అదానీతో చేసుకున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు హెచ్చరించారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల భారంపై చేపట్టిన ప్రచార యాత్ర 12వ వార్డులో బుధవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి విద్యుత్ స్మార్ట్‌మీటర్ల వల్ల కలిగే ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైకుంఠరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత మంత్రి లోకేష్ స్మార్ట్‌మీటర్లు బిగిస్తే బద్దలుగొట్టండి అని చెప్పి అధికారంలోకి రాగానే స్మార్ట్‌మీటర్లను బిగించి ప్రజలపై విద్యుత్ భారాలు వేయడం ప్రజలను మోసగించడమేనన్నారు. ఇప్పటికే ట్రూఅప్, ఇంధన ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు రకరకాల పేర్లతో ప్రజలపై మోయలేని విద్యుత్ భారాలు వేసి మరలా స్మార్ట్ మీటర్లను తీసుకురావడం దారుణమన్నారు. ఎంసిపిఐ(యు) నాయకులు కె.మహంకాళి మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల ప్రమాదాన్ని ప్రజలకు తెలియజేసేందుకే ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎం.మంగతాయారు, రేణుక, అనసూయమ్మ, శ్రీను, అరుణ, వేంద్ర సర్వమ్మ, సత్తమ్మ, దుర్గ, స్థానికులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల పక్షపాతి ఎస్ఆర్.దాట్ల

ఘనంగా 46వ వర్ధంతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎస్ఆర్ దాట్ల కల్లుగీత కార్మిక సంఘం ఉద్యమ నిర్మాతగా, సిపిఎం నాయకునిగా, అత్తిలి మాజీ ఎంఎల్ఎగా తన జీవితాన్ని పీడిత ప్రజలకు అంకితం చేశారని పలువురు వక్తలు కొనియాడారు. ఎస్ఆర్.దాట్ల 46వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత బ్రాహ్మణ చెరువు నుండి పెనుమంట్ర వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఆర్ దాట్ల స్తూపం వద్ద జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఎస్ఆర్.దాట్ల సంపన్న కుటుంబంలో పుట్టినప్పటికీ తన యావత్ జీవితాన్ని అణగారిన పీడిత ప్రజల పక్షపాతిగా, వారి అభ్యున్నతి కోసం అర్పించారన్నారు. కల్లుగీత కార్మికులను రాష్ట్రవ్యాప్తంగా సంఘటితం చేయడంలో, గీత కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడంలో ఆయనకు ఆయనే సాటి అని సీతారాం అన్నారు. మచ్చలేని నాయకుడిగా జీవించిన దాట్ల నేటి యువతకు ఎంతో



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

స్ఫూర్తిదాయకులని అన్నారు. సభకు మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రసాద్ అధ్యక్షత వహించగా స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సీతారాం ఆవిష్కరించారు కార్యక్రమంలో దాట్ల కుమార్తె సుందరి, అల్లుడు రాఘవరాజు, ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి, వివిధ సంఘాల జిల్లా నేతలు ఆకుల హరేరాం, ఎ.అజయ్‌కుమారి, కేతా పద్మజ, నేతల చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


ఎస్ఆర్ దాట్ల మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బయోలాజికల్ -ఇ- లిమిటెడ్ సహకారంతో పెనుమంట్ర లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక ఉచిత మందుల పంపిణీ శిబిరాన్ని ప్రారంభించారు. బయోలాజికల్ మాజీ ఎమ్‌డి విజయ్‌కుమార్ ఎస్ఆర్.దాట్ల చిత్రపటానికి పుష్పమాల వేసిన నివాళులు అర్పించారు. డాక్టర్ సందీప్ వర్మ వైద్య సేవలందించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంతెన పూర్ణిమ, డాక్టర్ ఇందిరా రాజు, మహిమ దాట్ల, చిలువూరి రాఘవరాజు, చిలూవురి సుందరి, కె.సుబ్బరాజు, నక్క కాంతారావు మంగం సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి


ఎఎస్‌పి భీమారావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు అన్నారు. గురువారం ప్లాస్టిక్ నిషేధ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధ పోస్టర్‌ను ఆవిష్కరించారు. భీమారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తులపై నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. ప్లాస్టిక్ వినియోగం వీడి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, టివివి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రాణాంతక ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిలువరించాలన్నారు. కార్యక్రమంలో సిఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఎఎస్‌పి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అడిషనల్ ఎస్‌పి భీమారావు



చించినాడ సొసైటీ ఛైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సత్యనారాయణ రాజు

సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తా

చించినాడ సొసైటీ నూతన అధ్యక్షులు రుద్రరాజు సత్యనారాయణరాజు

ప్రజాశక్తి - యలమంచిలి

రైతాంగానికి సేవలందిస్తూ చించినాడ సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆ సొసైటీ నూతన ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రుద్రరాజు సత్యనారాయణరాజు అన్నారు. ఈ సందర్భంగా గురువారం టిడిపి మండలాధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన సభలో సత్యనారాయణరాజు మాట్లాడుతూ గతంలో మాజీ ఎంఎల్‌ఎ ఆర్ఎస్, మాజీ సర్పంచి, సొసైటీ మాజీ ఛైర్మన్ సూర్యనారాయణరాజుతోపాటు పలువురు ప్రముఖులు చించినాడ సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఎంతగానో కృషి చేశారన్నారు. సూర్యనారాయణరాజు వంటి నాయకుడైతే రూ.కోట్లు ఖరీదు చేసే తన సొంత స్థలాన్ని కూడా సొసైటీ నిర్మించడానికి ఉచితంగా దానం చేశారని, వారిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో చించినాడ సొసైటీని మంత్రి నిమ్మల సహకారంతో అగ్రభాగాన నిలిపేందుకు కృషి చేస్తానని చెప్పారు. సత్యనారాయణరాజుతోపాటు సభ్యులుగా కొప్పునీడు వెంకట సత్యనారాయణ, కవురు శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆరుమిల్లి రామశ్రీనివాస్, రామభద్రరాజు, మాజీ సర్పంచి రుద్రరాజు సత్యనారాయణరాజు, రుద్రరాజు పెద్దవర్మ, రుద్రరాజు చిన్న వర్మ, యలమంచిలి సొసైటీ అధ్యక్షులు బొప్పన హరికిషోర్, ముచ్చర్ల శ్రీనివాస్, పీతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద 2న ధర్నా - ఫ్యాప్టో ఛైర్మన్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ ప్రకాశం

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక కలెక్టరేట్ వద్ద ఆగస్టు రెండో తేదీన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో ఛైర్మన్ పిఎస్.విజయరామరాజు, సెక్రటరీ జనరల్ ప్రకాశం పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరామరాజు, ప్రకాశం మాట్లాడుతూ 12వ పిఆర్‌సి, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సిపిఎస్ రద్దు, యాప్‌ల భారం తగ్గించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని



అభివాదం తెలియజేస్తున్న ఫ్యాప్టో నేతలు

డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నాలో జిల్లాలోని ఉపాధ్యాయులందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఫ్యాప్టో కో ఛైర్మన్ పిఆర్‌విఎస్.సాయివర్మ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ రమణరావు, ఇతర నేతలు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపీమూర్తి మద్దతు

ఫ్యాప్టో ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్ వద్ద ఆగస్టు 2వ తేదీన జరగనున్న ధర్నాకు పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మద్దతు ప్రకటించారు. స్థానిక పిడిఎఫ్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన ఫ్యాప్టో నేతలతో మాట్లాడారు. ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. బోధనేతర పనులు అప్పగించి బోధనకు దూరం చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై రాబోయే రోజుల్లో పిడిఎఫ్ తరపున పోరాడతామని తెలిపారు.

ఆక్వా రైతులకు విద్యుత్ శాఖ సిబ్బంది కుచ్చుటోపీ!

బిల్లుతో సంబంధం లేకుండా సొమ్ము వసూలు

విచారణకు రంగంలోకి దిగిన 9 బృందాలు

విచారణ తీరుపై అనుమానాల వెల్లువ

ప్రజాశక్తి - ఉండి

మండల పరిధిలోని అర్తమూరులో ఆక్వా రైతులకు విద్యుత్ సిబ్బంది కుచ్చుటోపీ పెట్టారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఆక్వా చెరువులకు సంబంధించి విద్యుత్ బిల్లులు అక్కడి లైన్‌మెన్ తీయడమే కాకుండా, ఆ సొమ్ము రైతుల నుంచి వసూలు చేసే పని కూడా సదరు వ్యక్తే చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై స్థానిక రైతు ఒకరు ఇటీవల భీమవరంలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి బిల్లులపై ఆరా తీసినట్లు సమాచారం. ఆపై బిల్లుల్లో అవకతకలు జరిగినట్లు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయగా గుట్టుచప్పుడు కాకుండా అధికారులు సాగించిన విచారణలో లైన్‌మెన్ లీలలు పెద్దఎత్తున వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై ఆ ప్రాంత రైతులు దీనిపై ఎటువంటి ఫిర్యాదూ చేయకుండా మధ్యవర్తులు రంగంలోకి దిగి అధికారుల సహకారంతో సెటిల్‌మెంట్ చేశారని ప్రచారం సాగుతోంది. ఈ రూపంలో రూ.5.60 లక్షలు లైన్‌మెన్ నుంచి రైతులకు ఇప్పించనట్లు సమాచారం. ఇదిగా



విచారిస్తున్న అధికారులు

ఉండగా ఆక్వారైతు ఫిర్యాదుతో దర్యాప్తు చేయగా రూ.89,730 విద్యుత్ బిల్లులకుగాను వసూలు చేసి ఎపిఇపిడిసిఎల్‌కు జమ చేయనట్లు గుర్తించామని, ఆ సొమ్మును రికవరీ చేసి బిల్లు కట్టించామని విద్యుత్ శాఖ ఎఇ పి.శ్రీనివాస్ తెలిపారు. ఇదే క్రమంలో అర్తమూరులో విద్యుత్ శాఖకు సంబంధించిన తొమ్మిది బృందాలు రంగంలోకి దిగి 130 సర్వీసులకు సంబంధించిన రైతులను గురువారం విచారించారు. అయితే మరో 127 సర్వీసులకు సంబంధించిన రైతులను విచారించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న లైన్‌మెన్ గతంలో కాళ్ల మండలంలోనూ ఆక్వా రైతుల నుంచి అక్రమంగా సొమ్ము వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయని ప్రచారం సాగుతోంది. విచారణ పూర్తయ్యిందని, ఎటువంటి అవకతవకలు జరగలేదని మండలస్థాయి అధికారులు చెబుతుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పకడ్బందీగా విచారణ జరిపించి చర్యలు తీసుకుంటారా, లేక మమ అన్పిస్తారా అనేది వేచిచూడాలి.

తాగునీరు, పారిశుధ్యంపై అశ్రద్ధ వద్దు

డిపిఒ రామనాధరెడ్డి

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో ప్రజలకు అందించే తాగునీటి విషయంలో అధికారులు ప్రజాప్రతినిధులు అశ్రద్ధ వహించొద్దని జిల్లా పంచాయతీ అధికారి ఎన్.రామనాధరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. పంచాయతీకి సంబంధించిన పన్నులు, లైసెన్స్ ఫీజుల వివరాలు పరిశీలించారు. అనంతరం డిపిఒ మాట్లాడుతూ పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. దోమలు పెరగకుండా నివారణా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి చెరువుల్లో నీరు రంగు మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి, డిప్యూటీ ఎంపిడిఒ పి.సత్యనారాయణ, గ్రామ సర్పంచి మూరా అలంకారం, పంచాయతీ కార్యదర్శి డి.శివరామప్రసాద్, జనసేన నాయకులు తోట శ్రీను, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిపిఒ రామనాథరెడ్డి

సాంకేతికతతో ప్రజల జీవనోపాధి మెరుగు

ప్రజాశక్తి - కాళ్ల

సాంకేతికతను జోడించి గ్రామీణ ప్రజలు తమ జీవన స్థితిగతులు మెరుగుపర్చుకోవాలని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కోపల్లె గ్రామంలో పేద, బలహీన వర్గాల వారికి సాంకేతికతను ఉపయోగించి గ్రామీణ ఉపాధి అవకాశాలు ఎలా మెరుగుపరుచుకోవాలనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కళాశాల సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ (ఎస్‌టిఐ) హబ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ (డిఎస్‌టి) సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఐ హబ్ ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ డాక్టర్ జి.హరీష్‌కుమార్‌వర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగపతిరాజు మాట్లాడుతూ ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సామాజిక బాధ్యతగా ఉచితంగా సాంకేతిక సహాయం అందిస్తుందన్నారు.



మాట్లాడుతన్న జగపతిరాజు

లబ్ధిదారులు పలు రకాల ఉత్పత్తుల గ్రూపులుగా ఏర్పడి ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ సహజంగా నీటి వనరుల ద్వారా లభ్యమయ్యే వాటిని ఉపయోగించి పలు రకాల ఉత్పత్తులు తయారు చేయవచ్చునన్నారు. రైతులకు సహాయకారిగా ఉండే విధంగా ఆక్వా చెరువుల్లో చేప నుండి నూనె తీయడం, చేపల మేత తయారు చేయడం వంటి వాటిని తమ కళాశాలలో ప్రత్యేక లేబరేటరీస్ ద్వారా ఎంపిక కాబడిన ప్రతిఒక్కరికీ ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు. దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఎస్‌టిఐ హబ్ కోఆర్డినేటర్, ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ డాక్టర్ జి.హరీష్‌కుమార్‌వర్మ మాట్లాడుతూ కళాశాలకు సమీపంలో ఉన్న కోపల్లె, పెదఅమిరం, జక్కరం గ్రామాలను ప్రత్యేకంగా ఎంపిక చేసుకుని పేదలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోపల్లె ఉప సర్పంచి బూడి వెంకటపరాలు, ఎస్‌టిఐ హబ్ కోప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ డాక్టర్ సిహెచ్.రామబద్రిరాజు, వెట్ సెంటర్ ప్రొఫెసర్ ఎస్.శివకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు విజయ్‌కిరణ్‌కు ప్రశంసలు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని ఎల్‌బిచర్ల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో గణిత ఉపాధ్యాయుడు బేతపూడి విజయ్‌కిరణ్‌కు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రశంసలు లభించాయి. దేశంలో సాంస్కృతిక జీవన విధానం, అంతరించిపోతున్న కళల పునర్జీవనానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో భారత సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జులై 9 నుండి 29 వరకు శిక్షణ ఇచ్చారు. దీనిలో పశ్చిమగోదావరి జిల్లా నుంచి పాల్గొన్న విజయ్‌కిరణ్ ఆంధ్రప్రదేశ్‌లో చేతివృత్తుల కళాకారుల జీవన స్థితిగతులు అనే అంశంపై ప్రాజెక్టు సమర్పించారు. దీనికిగాను ఈ ప్రశంసా పత్రాన్ని హైదరాబాద్‌లోని సాంస్కృతిక ప్రాంతీయ కేంద్రంలో కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాహుల్ అందజేశారు. ఈ నేపథ్యంలో స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.శ్యాంప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ పి.మార్క్, పాఠశాల సిబ్బంది విజయ్ కిరణ్‌ను అభినందించారు.



ప్రశాంసాపత్రాన్ని అందుకుంటున్న విజయ్ కిరణ్

సమన్వయంతో పనిచేస్తేనే సమాజ ప్రగతి

ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పరిపాలనా రంగంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే సమాజ ప్రగతి సాధ్యమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో గురువారం స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఎంఎల్ఎ అంజిబాబును కలిసి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, దీనిపై ఇటీవల జరిగిన మున్సిపల్ సమీక్షా సమావేశంలో కూడా ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడారు. అధికారులు అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. పట్టణాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల సహకారం ఎప్పుడూ ముందుండి సహకారాలు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వలిశెట్టి రామకృష్ణ, యర్రంశెట్టి శివకృష్ణ, టివిబి ప్రసాద్, చల్లా రామ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ఉండి



విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేస్తున్న మాదాని గోపి

విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని కెపిఎస్ మండల కార్యదర్శి మాదాని గోపి అన్నారు. గురువారం పాందువ్వ గ్రామంలో ఉండి కో ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ మాదాని వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు కెపిఎస్ మండల కార్యదర్శి మాదాని గోపి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, అంగన్వాడీలో చదివే 30 మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. విద్య వెలకట్టలేనిదని ఎవరు దొంగిలించలేనిదని అటువంటి విద్యను నిర్లక్ష్యం చేయకూడదని పాఠశాల ఉపాధ్యాయుడు దాగారపు గోపాలం అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సత్యవతి, ఎం.ఆనంద్, ఎం.జాన్, ఎం.అర్జున్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సొసైటీ ఛైర్మన్, సభ్యులు

లంకలకోడేరు సొసైటీ ఛైర్మన్‌గా సత్యనారాయణరాజు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు విశాల సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా పెన్మత్స సత్యనారాయణ రాజు బుధవారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు హాజరయ్యారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని రామసూరి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. ఛైర్మన్‌తో పాటు పర్సన్స్‌గా యర్రంశెట్టి నాగ వెంకట సత్యనారాయణ మూర్తి, నిల్ల వీరభద్రరావు ప్రమాణ స్వీకారం చేశారు. టిడిపి మండల అధ్యక్షులు పాముల రజిని కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంగర మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలనూ సమన్వయం చేస్తూ కూటమి ప్రభుత్వం బాధ్యతలను అప్పగిస్తోందన్నారు. పాలకొల్లు మండలంలో ఎక్కువ టర్నోవర్ కలిగిన సహకార సంఘంగా మంచి గుర్తింపు లంకలకోడేరుకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చొప్పల రజని, గ్రామ కార్యదర్శి కానూరి రాజేష్, బిజెపి నాయకులు కబర్ది, నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, కోడి విజయభాస్కర్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సొసైటీ ఛైర్మన్, సభ్యులు

అరట్లకట్ట సొసైటీ ఛైర్మన్‌గా కుమారస్వామి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

అరట్లకట్ట వ్యవసాయ సహకార పరపతి సంఘానికి ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఛైర్మన్‌గా పొత్తూరి కుమారస్వామి రాజు, పర్సన్స్‌గా పోలిశెట్టి రామకృష్ణ, చింతపల్లి సత్యనారాయణ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ రావు అధ్యక్షత వహించి మాట్లాడారు. కుమారస్వామి రాజు సీనియర్ నాయకులని, వ్యవసాయ రంగంలో మంచి అనుభవం కలిగిన వ్యక్తి అని తెలిపారు. ఇలాంటి వ్యక్తి ఛైర్మన్‌గా ఉండడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మండల అధ్యక్షులు కోడి విజయ భాస్కర్‌రావు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. అధ్యక్షులు కుమారస్వామి రాజు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడుకు రుణపడి ఉంటానని తెలిపారు. రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహమ్మద్ అలీ, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, చింతపల్లి శ్రీనివాస్, ఉన్నమట్ల కబర్ది, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, రైతులు హాజరయ్యారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏవిధంగా సాయం చేయాలని ఆలోచిస్తుంటే గత వైసిపి ప్రభుత్వం ఇసుక, మద్యం, మట్టి గనులను ఎలా దోపిడీ చేయాలని ఆలోచించిందని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గంలో ఒకే రోజు 83 మందికి రూ.61 లక్షలు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క రూపాయి సాయం చేయని వైసిపి శ్రేణులు వస్తే నిలదీయండన్నారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన మేలును పది మందికి చెప్పాల్సిన బాధ్యత లబ్ధిదారులదేనని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్ మెకానిక్ మృతి

నేరాలు - ఘోరాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

నరసాపురం సుజుకీ షోరూం నుంచి మార్టేరులో డెలివరీ ఇవాల్సిన యాక్సెస్ బండిపై వెళుతున్న మోటార్ మెకానిక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మోటార్ మెకానిక్ తెన్నేటి ప్రసాద్ (35) కొత్త బండి డెలివరీ ఇచ్చేందుకు మార్టేరు బయలుదేరాడు. ఈ క్రమంలో పాలకొల్లు - దిగమర్రు రోడ్డు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న చేపల లోడు లారీ ఢీకొంది. దీంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ ఆపకుండా వెళ్లడంతో సమీపంలో కొందరు వెంబడించి ఆపారు. అయితే ప్రమాద విషయం తెలీదని, వెనుక చక్రం కింద పడి ఉండొచ్చని డ్రైవర్ పోలీసులకు తెలిపాడు. పాలకొల్లు ఎఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని ఓ లాడ్జిలో గురువారం నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేశామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఈ దాడిలో ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులో తీసుకుని వారి వద్ద నుండి రూ.16,700 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బెల్టు షాపులు తొలగించే వరకూ పోరాటం

ప్రజాశక్తి - పెనుమంట్ర



మాట్లాడుతున్న కామన మునిస్వామి

బెల్ట్ షాపులు పూర్తిగా తొలగించే వరకూ గీత కార్మికుల పోరాటం ఆగదని ఎపి కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అన్నారు. గురువారం పెనుమంట్రలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కామన మునిస్వామి మాట్లాడుతూ జిల్లాలో 5,000 బెల్టు షాపులు ఉన్నాయని, వాటిని అరికట్టడంలో ఎక్సైజ్ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. కల్లు అమ్ముడుపోక కార్మికులు పస్తులతో కాలం గడుపుతున్నారన్నారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, బెల్ట్ షాపులు తొలగిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు వాగ్దానం చేశారని, అధికారంలోకి వచ్చాక ఏదీ అమలు కాలేదని తెలిపారు. తాటి, ఈత చెట్లపై నుంచి ప్రమాదవశాత్తూ పడి మృతి చెంది, వికలాంగులైన వారికి ఒక రూపాయి కూడా ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదని తెలిపారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ నేతలు బొక్క చంటి, దాసరి సూరిబాబు, జిల్లా నాయకులు బొంతు శ్రీను, చింతపల్లి చిన్న వీరస్వామి, జి.సత్యనారాయణ, రాజులపాటి సాంబశివరావు, వీరంకి రామకృష్ణ పాల్గొన్నారు.

154 స్పౌజ్ పింఛన్లు మంజూరు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆచంట



ఆచంట : మాట్లాడుతున్న ఎంపిడిఒ

మండలంలో 154 మంది వితంతువులకు స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ కృష్ణమోహన్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, విజన్ టీమ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ భరోసాలో మండలంలో పింఛను పొందే భర్తను కోల్పోయిన 154 మంది వితంతువులకు కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయన్నారు. రూ.6 లక్షల 16 వేలు బ్యాంకుల నుండి గురువారం డ్రా చేసి ఆగస్టు 1న ఆయా గ్రామాల్లో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకుల సమక్షంలో పంపిణీకి చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. పేదరిక నిర్మూలన పి4 నీడ్ అసెస్మెంట్ సర్వే వేగవంతం చేసి ఆగస్టు 3 నాటికి నూరుశాతం పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ కె.బులి సూరన్న, కార్యదర్శులు నాగబాబు, హనుమంతరావు, దుర్గాప్రసాద్, జానకి విజన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

గణపవరం : మండలంలో కొత్తగా 119 వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి గురువారం చెప్పారు. ఏ గోపవరంలో 5, అప్పన్నపేటలో 10, అర్థవరంలో 10, సిహెచ్.అగ్రహారంలో 4, గణపవరం 1లో 7, గణపవరం 2లో 1, గణపవరం 3లో 3, గణపవరం 4లో 4, కాశిపాడులో 6, కేశవరంలో 11, కోమర్రులో 6, జల్లికొమ్మరలో 8, కొత్తపల్లిలో 4, మొయ్యేరులో 5, ముప్పర్తిపాడులో 6, పిప్పర 1లో 5, పిప్పర 2లో 5, సరిపల్లిలో 10, ఎస్.కొండేపాడులో 3, వల్లూరులో 6 మొత్తం 119 పెన్షన్లు మంజూరైనట్లు తెలిపారు. పెన్షన్లు మంజూరైన వారికి ఆగస్టు 1న ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు నాలుగో సచివాలయం వద్ద పెన్షన్లు అందజేస్తారని చెప్పారు.

101 చౌక దుకాణ డీలర్ల ఖాళీలు

త్వరలో భర్తీ చేస్తాం : ఎఎస్ఒ రవిశంకర్

ప్రజాశక్తి - ఆకివీడు

జిల్లాలో 1052 చౌక డిపోల్లో 101 దుకాణాలకు డీలర్ల ఖాళీలు ఉన్నాయని, వాటిని త్వరలో భర్తీ చేస్తామని జిల్లా పౌర సరఫరాల శాఖ సహాయ అధికారి ఎం.రవిశంకర్ చెప్పారు. ఈ ఖాళీలకు ఇప్పటికే నోటిఫికేషన్ ఇవ్వడం, పరీక్షలు నిర్వహించడం జరిగిందని, వాటిని ప్రభుత్వం అనుమతి రాగానే భర్తీ చేస్తామని చెప్పారు. శుక్రవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయ సమావేశ మందిరంలో మండల చౌక డిపో డీలర్ల సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ 65 సంవత్సరాలు దాటిన ప్రతి కార్డుదారునికీ, వికలాంగులకూ, మంచంపై నుండి కదలలేని వారి జాబితాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి డీలరూ ఆ జాబితా ప్రకారం ఇంటింటికీ సరుకులు సరఫరా చేయాలని ఆదేశించారు. కొంతకాలం నుంచి ఖాళీగా ఉన్న ఈ పాస్ మిషను, కాటాలు పూర్తిగా వినియోగంలోకి తేవాలన్నారు. మండలంలోని నాలుగు ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామన్నారు. జిల్లాలో సమస్యాత్మకంగా మారిన రేషన్ వ్యాన్ల అంశం త్వరలో పరిష్కారం అవుతుందని రవిశంకర్ చెప్పారు. ఈ వ్యాన్లు ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా అందజేశారన్నారు.

క్రీడా పోటీల్లో పాలకొల్లు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

హైదరాబాద్‌లోని జులై 28, 29, 30వ తేదీల్లో జరిగిన సౌత్ జోన్ క్రికెట్ పోటీల్లో ఆంధ్ర తరపున ఆడిన టీమ్‌లో పాలకొల్లుకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక విశ్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇంటర్ విద్యార్థి విన్నకోట కుశ్వంత్ ప్రణవ రాజా బ్యాటింగ్‌లో, జోగాడ శివశరణ్ బౌలింగ్ విభాగాల్లో ప్రతిభ కనపర్చి సెంట్రల్ జోన్‌పై విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 3 రోజులపాటు జరిగిన పోటీల్లో జి 30, టి 20 వన్ డే మ్యాచ్ లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అభినందించారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న షరీఫ్, పొత్తూరి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ అన్నారు. గురువారం పట్టణంలోని 14వ వార్డులో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజుతో కలిసి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి సంక్షేమం, అభివృద్ధి వివరించారు. కార్యక్రమంలో సంకు భాస్కర్, అధికారి అనంతరామారావు, బేగం, సునీత, హుస్సేన్, మల్లాడి మూర్తి, మావూరి ఆనంద్, దేశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ఆకివీడు



కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యుల ఘర్షణ

నగర పంచాయతీ సమావేశం గురువారం రసాభాసగా మారింది. స్థానిక డంపింగ్ యార్డు అంశంపై సమావేశంలో వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ, సభ్యులు గేదెల అప్పారావు మధ్య చర్చ వాడి వేడిగా సాగింది. నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం గురువారం మధ్యాహ్నం ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన జరిగింది. వైస్ ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ డంపింగ్ యార్డు గురించి తనను అనడం ఏంటని, ఎవరు పడితే వారు మాట్లాడడానికి ఒప్పుకోనని తెలిపారు. అసలు డంపింగ్ యార్డు స్థలాన్ని తాను నిర్ణయించడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన మరో సభ్యులు గేదెల అప్పారావు కలుగజేసుకొని మిమ్మల్ని ఎవరన్నారని ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ పెరిగింది. సభ ప్రారంభంలో నాలుగో వార్డుకు చెందిన కూటమి సభ్యురాలు బత్తిన శ్యామల చర్చను ప్రారంభిస్తూ కనీసం నాలుగు రోజులు కూడా వ్యవధి లేకుండా ఒక్కరోజు ముందు అజెండా ఇవ్వడాన్ని తప్పుబట్టారు. పట్టణంలో 13, 17, 8 వార్డులకే అభివృద్ధిని పరిమితం చేయడం తగదన్నారు. కౌన్సిల్ అజెండాలోని ఏ అంశంపైనా చర్చ జరగకుండానే సమావేశం ముగియడం మరో ప్రధాన అంశం.



సూర్యనారాయణ రెడ్డిని సత్కరిస్తున్న ఎంఇఒ

సూర్యనారాయణ రెడ్డి సేవలు ఎనలేనివి

పెనుమంట్ర: తన ఉద్యోగ జీవితంలో 39 ఏళ్ల పాటు హెచ్‌ఎం చిర్ల చిన సూర్యనారాయణ రెడ్డి (బాబు) చేసిన సేవలు ఎనలేనివని డివైఇఒ డి.మురళీ సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం మార్టేరు ఎస్‌వి ఆడిటోరియంలో జరిగిన సూర్యనారాయణ రెడ్డి ఉద్యోగ విరమణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. మార్టేరులో బాస్కెట్ బాల్ క్రీడకు వన్నె తెచ్చిన వారిలో రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయడంలో ప్రహ్లాద రెడ్డి వేసిన బాటలో సూర్యనారాయణ రెడ్డి నడిచారని కొనియాడారు. సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా పనిచేయడం, ఇక్కడే ఉద్యోగ విరమణ పొందడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ 1 వై.లక్ష్మీనారాయణ, రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ బి.జాన్సన్, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీరామచంద్రమూర్తి, బిడి జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.లక్ష్మీనగేష్, ఎస్.నరసింహం, సత్యప్రియరామ్, జి.సత్యనారాయణ రెడ్డి, ఖండవల్లి కిషోర్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీలో అన్యాయం

ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు రమణ,.శ్రీమన్నారాయణ

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్రంలో 97 శాతంగా ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను కాదని 3 శాతం కూడా లేని ప్రభుత్వ ఉపాధ్యాయులకు డివైఇఒ, ఎంఇఒ-1 పోస్టులను కట్టబెట్టడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని, ఈ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎపి ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎన్‌వి.రమణ, ఎంఎన్.శ్రీమన్నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ న్యాయ స్థానాలు యథా స్థితిలో కొనసాగించమని చెప్పినప్పటికీ ఏక పక్షంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు అనుకూలంగా వ్యవహరించడం పట్ల పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఇఒ-1 పోస్టులను ఎఫ్‌ఎసిలుగా ప్రభుత్వ యాజమాన్యంలోని హెచ్‌ఎంలకు మాత్రమే కాకుండా స్కూల్ అసిస్టెంట్లతో కూడా భర్తీ చేయటానికి పూనుకోవడం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. జిఒ 154 ప్రకారం ఎంఇఒ-1 పోస్టులు కేవలం 13 మాత్రమే అయినప్పటికీ మిగిలిన అన్ని 666 పోస్టులను ఎంఇఒ-1 లుగా పరిగణిస్తూ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను పరిగణలోకి తీసుకోకుండా ఎంతో జూనియర్స్ అయిన ప్రభుత్వ ఎస్‌ఎలకు కట్టబెట్టాలని చూడటం నిబంధనలకు గండి కొట్టడమేనని విమర్శించారు. దీనివల్ల నష్టపోయేది ఇప్పుడు విధులు నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు మాత్రమే కాదని, దీర్ఘకాలంలో 97శాతం గా ఉన్న పంచాయితీరాజ్ ఉపాధ్యాయులే అని పేర్కొన్నారు. వాస్తవానికి 1998 వరకు ఎపిపిఎస్‌సి ద్వారా నియమించబడిన వారు మాత్రమే ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పరిగణించబడుతారని కాని డిఎస్‌సి ద్వారా నియమితులైనటువంటి వారిని కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పరిగణిస్తూ ఎంతో జూనియర్స్ అయిన వారిని కూడా ఎంఇఒ-1లుగా నియమించాలని చూడడం సర్వీస్ రూల్స్‌కి వ్యతిరేకమే అన్నారు. ఈ చర్యలను తక్షణం విరమింపజేసి పంచాయతీరాజ్ హెచ్‌ఎం, ఎంఇఒలకు న్యాయం చేయాలని కోరారు.

నేడు పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 1వ తేదీ శుక్రవారం భీమవరంలో సబ్‌స్టేషన్ మెయింటెన్స్ నిమిత్తం వీరవాసరం మండలంలో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఇ అప్పారావు గురువారం తెలిపారు. వీరవాసరం, కొణితివాడ, మత్స్యపురి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వీరవాసరం, రాయకుదురు, తోలేరు, పంజావేమవరం, నందమూరి గరువు, పెర్కిపాలెం, చింతలకోటిగరువు, వివి.పాలెం, నడపనవారిపాలెం, కొనితివాడ, నవుడూరు, అండలూరు, మడుగు పోలవరం, నేలపోగుల గ్రామాల్లో ఇండస్ట్రియల్ ఫీడర్ మత్స్యపురి, బొబ్బనపల్లి, వడ్డిగూడెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఆచంట : ఆచంట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధుకుమార్ తెలిపారు. కౌరుపాలెం ఫీడర్ల విద్యుత్ లైన్ మెయింటినెన్స్, చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో ఆచంట గ్రామ పరిధిలోని ఆచంట టౌన్, కౌరుపాలెం, కాపులపాలెం, మానెంవారిపాలెం, పోర, చెమ్మచెరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తణుకు : పట్టణ పరిధిలోని తణుకు బైపాస్, అత్తిలి, ఇరగవరం, తేతలి సబ్ స్టేషన్లలో లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం 1వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులు సహకరించాలని కోరారు. తణుకులోని ఎన్‌టిఆర్ పార్కు, సాయి హాస్పటల్, ఎన్‌జిఒ కాలనీ, కొండాలమ్మపుంత రోడ్డు, ఉమెన్స్ కాలేజీ, డీ మార్టు, పాతవూరు, ఇరగవరం కాలనీ, శివబాలాజీ నగర్, మున్సిపల్ కార్యాలయం, కొమ్మాయి చెరువుగట్టు ప్రాంతాల్లోనూ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలాగే తణుకు రూరల్ మండలంలోని తేతలి హౌసింగ్ కాలనీ, ఇందిరా నగర్, తేతలి పారిశ్రామిక ప్రాంతం, వడ్లూరు, చివటంలో.. అత్తిలి మండలంలోని అత్తిలి, పాలి, ఆరవల్లి, దంతుపల్లి, మంచిలి, ఉరదాళ్లపాలెం, పాలూరు, కెఎస్ గట్టు, బల్లిపాడు, గుమ్మంపాడు, వరిఘేడు, తిరుపతిపురం, శివపురం, కొమ్మర, ఈడూరు, కంచుమర్రు, స్కిన్నెరపురం, సిహెచ్ చెరువు ప్రాంతాల్లోనూ ఇరగవరం మండలంలోని ఇరగవరం, హనుమాజీపాలెం, చినరామునిచెరువు, గొల్లమాలపల్లి, కంతేరు, కొత్తపాడు, కత్తవపాడు, పొదలాడ, కాకిలేరు, పేకేరు, అయితంపూడి, ఏలేటిపాడు, రాపాక, అయినపర్రు, అర్జునుడిపాలెం, ఓగిడి, పెద్దిరెడ్డిపాలెం, తూర్పువిప్పర్రు, కె కుముదవల్లి, ఆర్ ఖండ్రిక, కాకుల ఇల్లిందలపర్రు, నారాయణపురం, గోటేరు, యర్రాయిచెరువు, గోపాలపురం, కేతావారిపాలెం ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పాలకొల్లు : ఈనెల ఒకటిన పాలకొల్లు సబ్ స్టేషన్ పరిధిలోని చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం పాలకొల్లు వన్ టౌన్ ఫీడర్ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నరసాపురం విద్యుత్ ఇఇ కె.మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని యడ్లబజార్ నుంచి పెదగోపురం రోడ్, రామచంద్ర కాలనీ, పోస్ట్ ఆఫీస్ ప్రాంతం, బ్యాంకు స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఉదయం 08.00 గంటల నుండి 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కనకాచలం మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - వీరవాసరం

నవుడూరుకు చెందిన ఆచంట కనకాచలం మరణం రైతు సంఘానికి తీరని లోటని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ కొబ్బరి రైతుల సమస్యలపై కనకాచలం మంచి కృషి చేశారని, రైతు సంఘం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని కొనియాడారు. అనంతరం కనకాచలానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు లింగం సత్యనారాయణ, యాళ్లబండి నారాయణమూర్తి, పాల కోటేశ్వరరావు, మైగాపుల త్రిమూర్తులు ఉన్నారు.

పౌరులంతా కలిసిమెలిసి ఉండాలి

ప్రజాశక్తి - ఆకివీడు

పౌరులంతా కలిసిమెలిసి జీవించాలని తహశీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు సూచించారు. చెరుకుమిల్లి గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయ భవనంలో పౌర హక్కుల దినోత్సవం జరిగింది. గ్రామ సర్పంచి పి.ప్రకాశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల వివక్ష తగదన్నారు. ఎస్‌సి ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి పంచాయతీలు చొరవ చూపాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారులకు తెలపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఆంజనేయులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు రాములబంద గరువులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ రాములబంద గరువులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బొల్లా చంటి, పిఎంఎ రాజులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఎ షరీఫ్, నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు కోట రోడ్డులోని దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన చేశారు. ఉండపల్లి సాయి సహస్ర అన్న ప్రసన్నం సందర్భంగా ఉపాధ్యాయులు ఉండపల్లి ప్రభుదేవా, కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పూలపల్లిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుళాయి చెరువు వద్ద కాలనీకి గ్రామ పంచాయతీ నిధులతో 10 విద్యుత్ స్తంభాలు వేసి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ వీధి లైట్లను మాజీ ఎఎంసి ఛైర్మన్, క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టు ముక్కల గాంధీ భగవాన్ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు వివి.శ్రీహరిరాజు, పంచాయతీ కార్యదర్శి పాల శ్రీనివాస్, గుబ్బల ప్రసాద్, నాగరాజు చాంద్‌రాజు, లక్ష్మణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి సిఎస్ డిటిగా ఆంజనేయులు

ప్రజాశక్తి - ఆకివీడు

మండల పౌర సరఫరాల విభాగం ఇన్‌ఛార్జిగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) వంటపాటి ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పౌర సరఫరాల సహాయ అధికారి ఎం.రవిశంకర్ శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన డీలర్ల సమావేశంలో ప్రకటించారు. సుమారు ఐదు సంవత్సరాల నుంచి ఖాళీగా ఉన్న మండల పౌర సరఫరాల విభాగం డిటి స్థానం ఎట్టకేలకు ఇన్‌ఛార్జితో భర్తీ అయ్యింది. కొంతకాలం ఉండి మండలం నుండి మరికొంత కాలం భీమవరం నుండి ఇన్‌ఛార్జిలను నియమించారు. అయితే ఇటీవల కాలంలో పూర్తిగా ఆ బాధ్యులకు కూడా బదిలీ అవడంతో పూర్తి ఖాళీ ఏర్పడింది. దీంతో స్థానికంగా మండలంలో సరఫరాల విభాగంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఫిర్యాదులు అధికారులకు అందాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఆర్ఐ ఆంజనేయులకు గురువారం నుంచి సివిల్ సప్లై అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతరం డీలర్లు ఆంజనేయులును సత్కరించారు.

ఒరిజనల్ దస్తావేజు మరియు పాసుపుస్తకం పోయినవి

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, వడ్లమాను గ్రామ వాస్తవ్యులు రెడ్డి వీర వెంకయ్య గారి భార్య రెడ్డి సీతారావమ్మ పేరన ఆగిరిపల్లి మండలం, వడ్లమాను రెవిన్యూ గ్రామంలోని ఆర్.యస్.నెం.307రు దాఖలా య.0.59 సెంట్లు వ్యవసాయ భూమికి సంబంధించిన ఒరిజనల్ దస్తావేజు (నెం.2299/2001) మరియు పట్టాదారు పాసుపుస్తకం (నెం.778874)లు జిరాక్స్‌లు తీయించుకొని వెళ్లె క్రమంలో ది.23.07.2025వ తేదీన పోయినవి. ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

రెడ్డి సీతారావమ్మ, (భర్త) వీర వెంకయ్య, వడ్లమాను గ్రామం, ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా. సెల్: 94928 53814.